## క్లుప్తంగా

### ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

**తడ:** స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవదానం తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి కల వారు వెబ్ సైట్‌లో ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 25న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 27, 28 తేదీల్లో కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. వివరాలకు 79935 68224లో సంప్రదించాలని కోరారు.

### విద్యార్థినికి ఆర్థిక సాయం



**విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్టు చైర్మన్, ఉపాధ్యాయులు**

**చిల్లకూరు :** పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినికి ఇంటర్‌లో చేరేందుకు అవసరమైన ఖర్చుల నిమిత్తం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సోమవారం రూ.10 వేల సాయం అందించారు. ట్రస్టు చైర్మన్ రాజనేని పిచ్చయ్య నాయుడు మాట్లాడుతూ తన కుమారుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్థ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే పారిచెర్లవారిపాళెంకు చెందిన పేద విద్యార్థిని ఎస్‌కే సాజీదా పదో తరగతిలో 539 మార్కులు సాధించిందని, ఇంటర్‌లో చేరేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిసి సాయం అందించినట్లు తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్ర, ఉపాధ్యాయులు వీవీ కుమార్, గ్రంధం మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, సురేంద్ర, ట్రస్టు ప్రతినిధి బాబు తదితరులు పాల్గొన్నారు.

### 4వ తేదీ వరకు తాగునీరు బంద్

**గూడూరు రూరల్ :** గూడూరు ఒకటి, రెండవ పట్టణాల్లో గురువారం వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వేములపాళెం నుంచి జెండామాను వరకు ఉన్న తాగునీటి పైపులైన్‌లో పది ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడ్డాయని తెలిపారు. వాటికి మరమ్మతులు చేసేందుకు గురువారం వరకు సమయం పడుతుందని తెలిపారు. అందువల్ల తాగునీటి సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గుర్తించి నీటిని పొదుపుగా వాడుకోవాలని, అలాగే ఏదైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల గైర్హాజరు

**దొరవారిసత్రం :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. వచ్చిన కొంత మంది అధికారులు ప్రజలతో అర్జీలు స్వీకరించారు. కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు బట్వాడా చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యం, ట్రాన్స్‌కో, పశుసంవర్ధక శాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసు, ఉద్యానవన, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది హాజరుకాలేదు.

**ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం**

**నాయుడుపేట టౌన్ :** ప్రజల సమస్యలకు సత్వరం పరిష్కారం అందిస్తామని డిప్యూటీ తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర తెలిపారు. ఆయన సోమవారం మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలపై రెండు అర్జీలు వచ్చినట్లు డీటీ వెల్లడించారు.

### విశ్రాంత ఉద్యోగికి సత్కారం



**సుబ్బయ్యను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు**

**కోట:** మండల విద్యాశాఖ కార్యాలయంలో మెసెంజర్‌గా పనిచేస్తున్న సుబ్బయ్య ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను సోమవారం యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు సుమాయిష్, విజయభాస్కర్, మనోహర్, వేళాంగిణి పాల్గొన్నారు.

# వీధుల్లోనే పింఛన్ల పంపిణీ

- కొన్ని చోట్ల సచివాలయాల్లో..
- వృద్ధులు, వికలాంగులకు తప్పని ఇక్కట్లు



**వాకాడు దళితవాడలో ఒకేచోట పింఛన్ అందజేస్తున్న మహిళా సిబ్బంది**

**చిల్లకూరు :** మండలంలో సోమవారం ప్రభుత్వం పింఛను పంపిణీని ఆర్భాటంగా ప్రారంభించింది. టీడీపీ నాయకులు, అధికారులు గ్రామాలకు చేరుకుని ఇంటి వద్దే పింఛను పంపిణీ చేస్తామని తొలుత ప్రకటించారు. తర్వాత అందరినీ వీధిలో ఒక చోట గుంపుగా చేర్చి నగదు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో సచివాలయాల వద్దకు రావాలని సూచించారు. మరికొన్ని చోట్ల తమకు నచ్చిన చోట కూర్చుని లబ్ధిదారులను పిలిపించుకుని నగదు అందజేసి మమా అనిపించారు. కొన్ని చోట్ల సర్వర్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మొత్తంగా చిల్లకూరు మండలంలో 88 శాతం మందికి పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో భానుమూర్తి తెలిపారు.

**సైదాపురంలో..**

**సైదాపురం:** మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సోమవారం సచివాలయ సిబ్బందితో పాటు టీడీపీ నేతలు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులను వీధిలో ఒక చోట గుంపుగా చేర్చి నగదు ఇచ్చారు. మరి కొన్ని చోట్ల సచివాలయాల వద్దకు రమ్మని చెప్పారు. కొన్ని గ్రామాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

**డక్కిలిలో..**

**డక్కిలి :** వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం నాగవోలు, మోపూరు రోడ్డు, వడ్ల మోపూరు, నడింపల్లి, డి.ఉప్పరపల్లి (గొల్లపల్లి) గ్రామ పంచాయతీల్లో ఇళ్ల వద్ద కాకుండా వీధిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

**వెంకటగిరిలో..**

**వెంకటగిరి రూరల్ :** రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం వెంకటగిరి 5, 7, 9 వార్డుల్లో పింఛను పంపిణీ చేశారు.

**వాకాడులో..**

**వాకాడు :** టీడీపీ నాయకులు సామాజిక పింఛనును మేమూ పంపిణీ చేశాం అనిపించారు. నాయకులు, అధికారులు, పలు కార్యాలయాల సిబ్బంది ఇంటింటికీ తిరగలేక రచ్చబండలు, కొన్ని ప్రధాన కూడళ్లను ఎంపిక చేసుకుని పింఛనుదారులను అక్కడికి పిలిపించుకుని 30 శాతం మందికి నగదు అందజేశారు. మిగిలిన వారు ఆయా వీధుల్లో నిరాశతో ఎదురు చూడాల్సిన పరిస్థితి. మరి కొందరి పేర్లు జాబితాలో లేవని చెప్పడంతో వారు ఆవేదన చెందారు.

**తడలో..**

**తడ:** రాష్ట్ర ప్రభుత్వం సోమవారం చేపట్టిన పింఛన్ల పంపిణీలో సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని కాదలూరులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, రామాపురంలో మాజీ ఎంపీ వరప్రసాదరావు లబ్ధిదారులను ఒక్క చోటికి చేర్చి పింఛను నగదు అందజేశారు.

**ఓజిలిలో..**

**ఓజిలి:** ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం ఓజిలి ఎస్‌ఎస్‌ఆర్ గిరిజన కాలనీలో అధికారులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, నాయకులు సత్యవరప్రసాద్‌రావు, వెంకటసుబ్బయ్య, మల్లికార్జునరెడ్డి, ఫ్రాంక్లిన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

**పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే నెలవల**

**సూళ్లూరుపేట :** ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోమవారం సాయినగర్, ఇందిరానగర్, సూళ్లూరు, రాఘవయ్యపేట ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పెంచిన పింఛనుతో కలిపి రూ.7 వేలు అందజేశామని తెలిపారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛను మొత్తాన్ని పెంచారని పేర్కొన్నారు.



**దొరవారిసత్రం : బురదముడుగులో పింఛను కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వికలాంగులు**

**రాపూరులో 94 శాతం పింఛన్ల పంపిణీ**

**రాపూరు:** మండలంలో సోమవారం సాయంత్రానికి 94.02 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. మండలంలో 6,639 మంది లబ్ధిదారులు ఉండగా 6,241 మందికి నగదు అందజేశారని తెలిపారు. మిగిలిన 398 మందికి మంగళవారం పంపిణీ చేస్తారని వివరించారు.

**టీడీపీ నాయకుల హడావుడి**

**నాయుడుపేట టౌన్ :** పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు హడావుడి చేశారు. మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది పింఛను నగదు పంపిణీకి సిద్ధమయ్యారు. టీడీపీ నాయకులు హడావుడి చేసి లబ్ధిదారులను ఒక చోటికి పిలిపించి పింఛన్ల పంపిణీ చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీలో 4,177 మందికి 3,771 మందికి, నాయుడుపేట మండలంలో 5,095 మందికి గాను 4,629 మందికి నగదు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

**పింఛన్ల కోసం పడిగాపులు**

**దొరవారిసత్రం :** మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం సామాజిక పింఛను నగదు కోసం అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులకు పడిగాపులు తప్పలేదు. మధ్యా హ్నం ఒంటి గంట వరకు సర్వర్ పనిచేయలేదు. దీంతో గ్రామాల్లోని పింఛనుదారులు పలు ఇబ్బందులు పడ్డారు. చేసేది ఏమీ లేక సచివాలయం సిబ్బంది వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

### మాట నిలబెట్టుకున్న తంబిరెడ్డి



**నిరుపేద మహిళకు నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు**

**నాయుడుపేట టౌన్ :** వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి సోమవారం నిరుపేద ఒంటరి మహిళ ముంతాజ్ అలియాస్ బుజ్జమ్మకు సోమవారం పింఛను నగదు అందజేసి మాట నిలబెట్టుకున్నారు. మునిరత్నం నగర్‌కు చెందిన బుజ్జమ్మకు సాంకేతిక కారణాలతో గతంలో పింఛన్ ఆగిపోయింది. ఆమె దీనస్థితి గురించి తెలుసుకున్న టీఎంఆర్ గ్రూపు సంస్థల అధినేత జనార్ధన్ రెడ్డి మూడు నెలలుగా బుజ్జమ్మకు నగదు అందజేస్తున్నారు. సోమవారం కూడా పింఛను మొత్తానికి సరిపడా నగదు అందజేశారు. తిరిగి ప్రభుత్వం ఆమెకు పింఛను మంజూరు చేసే వరకు సహాయం చేస్తానని తంబిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యాలరెడ్డి, పగడాల ప్రదీప్, సాయి పాల్గొన్నారు.

### కండలేరులో 6.321 టీఎంసీల నీరు

**రాపూరు:** కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.321 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# వైద్యులకు ఘన సన్మానం



**ఏరియా ఆస్పత్రిలో వైద్యులను సత్కరిస్తున్న ప్రగతి సేవా సంస్థ సభ్యులు**

**గూడూరు రూరల్ :** ఏదైనా రోగం బారిన పడితే బాగు చేసి పునర్జన్మ ఇచ్చేవారు వైద్యులని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ తెలిపారు. గూడూరు ఏరియా ఆస్పత్రిలో సోమవారం డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడుగురు వైద్యులను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడగలిగిన వారు వైద్యులని, అలాంటి వారిని ఏడాదికొకసారి సత్కరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. సీఆర్‌రెడ్డి వైద్యశాల వైద్యులు జనార్ధనరెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబంలో ఎన్ని చికాకులు ఉన్నా ఎదుటి వాడు ప్రమాదంలో ఉన్నాడని తెలిస్తే వెంటనే వైద్యం అందించి ప్రాణాలు కాపాడగలవాడే నిజమైన వైద్యుడని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు రాజా, రవికుమార్, ఎం రవికుమార్, రేణుకాదేవి, అలేయ, ప్రసూనా, ప్రియాంకను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులు, ప్రభాకర్, రాము, వెంకటేశ్వర్లు, క్రిష్టారెడ్డి, పెంచలయ్య, ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై వ్యక్తి హల్‌చల్



**తీవ్రంగా గాయపడిన అసోం వాసికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది**

**నాయుడుపేట టౌన్ :** మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం తీవ్ర గాయాలతో ఉన్న ఒక యువకుడు రోడ్డుపై నిలుచుకుని వచ్చిపోయే వాహనాలను నిలిపివేస్తూ, బైక్‌ల మీద వచ్చే వారిని కింద పడేస్తూ హల్ చల్ చేశాడు. పోలీసుల కథనం మేరకు.. అసోం ప్రాంతానికి చెందిన కొంతమంది యువకులు పనుల కోసం బెంగళూరుకు రైలులో బయలుదేరారు. మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ సమీపంలో మొగట్ సింగ్ అనే యువకుడు రైలు నుంచి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతను జాతయ రహదారిపైకి చేరుకున్నాడు. తీవ్ర రక్త స్రావం అవుతున్నా పట్టించుకోకుండా మతి భ్రమించిన వాడిలా రోడ్డు మధ్య నిలిచి వాహనాలను నిలిపి వేస్తూ గందరగోళం సృష్టించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ గోపి, హెడ్ కానిస్టేబుల్ మధు అక్కడికి చేరుకుని 108 అంబులెన్స్‌ను పిలిపించి అతనికి చికిత్స చేయించారు. అనంతరం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. రైలు నుంచి పడిపోయిన సంఘటనపై గూడూరు రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అధికారం లేకపోతే పార్టీకి రాం రాం

- నిన్న రాజీనామా..
- నేడు ఎమ్మెల్యే చెంత
- ఇదీ నేటి నాయకుల పరిస్థితి



**ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి కేక్ తినిపిస్తున్న దువ్వూరు బాలచంద్రారెడ్డి**

**సూళ్లూరుపేట :** అధికారంలో లేకపోతే కొందరికి నిద్ర పట్టదు. ఏ పార్టీ అధికారంలో ఉంటుందో అక్కడికి వెళ్లిపోయి వారి భజన చేయడం.. పదవులు అనుభవించడం పరిపాటి. అలాంటి కోవకు చెందిన వ్యక్తి దొరవారిసత్రం మండలానికి చెందిన దువ్వూరు బాలచంద్రారెడ్డి. ఆయన గడిచిన ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీలో నమ్మకంగా వుండి రెండు సార్లు చెంగాళమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్‌గా పదవిపొందారు. అలాగే తన వదిన దువ్వూరు సుజాతమ్మకు దొరవారిసత్రం ఎంపీపీగా పదవి ఇప్పించుకున్నారు. దువ్వూరు గోపాల్‌రెడ్డికి కూడా పదవి ఇప్పించుకున్నారు. నేడు వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోవడంతో వెంటనే పార్టీ మార్టీ మారిపోయారు. అధికారికంగా పార్టీ మారి కండువా కప్పుకోకపోయినా టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే విజయశ్రీ, ఆమె తండ్రి నెలవల సుబ్రమణ్యం చెంతకు చేరిపోయారు. కేక్ కట్ చేసి వారికి తినిపించారు. ఆయన వెంట కళత్తూరు రామ్మోహన్ రెడ్డి, నాయుడుపేటకు చెందిన కట్టా సుధాకర్‌రెడ్డి తదితరులు వుండడం విశేషం. గడిచిన ఐదేళ్లు సూళ్లూరుపేట, తడ మండలాల్లో పార్టీలో హవా కొనసాగించారు. నేడు చెంగాళమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ పదవిని తన సతీమణికి ఇప్పించుకోవడానికే ఆయన పార్టీ మారుతున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలో బాలచంద్రారెడ్డి టీడీపీలోకి వస్తున్నారంటే ఆ పార్టీ నాయకులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. కష్టాల్లో పార్టీకి అండగా వుండాల్సింది పోయి అధికారం కోసం పార్టీ మారడంపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ముగిసిన మాతమ్మ కొలుపు



**విశేషాలంకరణలో మాతమ్మ**

**డక్కిలి:** మండలంలోని పాతనాలపాడు (కమ్మవారిపల్లి) అరుంధతీవాడలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మాతమ్మ కొలుపు, ఉత్సవం సోమవారం ముగిసింది. సోమవారం తెల్లవారి జామున అమ్మవారికి అభిషేకం చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు మహిళలు పొంగళ్లు పెట్టారు.

### వెంకటరామరాజు సేవలు అనిర్వచనీయం



**వెంకట రామరాజును సన్మానిస్తున్న డీఎస్పీ**

**నాయుడుపేట టౌన్ :** నాయుడుపేట పోలీస్ సర్కిల్ పరిధిలో స్పెషల్ బ్రాంచి ఏఎస్ఐగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కొండూరు వెంకట రామరాజు సేవలు అనిర్వచనీయమని ఆ శాఖ అధికారులు, పట్టణ ప్రముఖులు కొనియాడారు. పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో సోమవారం ఆయనను సన్మానించారు. పోలీస్ శాఖలో 38 సంవత్సరాలుగా విశిష్ట సేవలను అందించిన అందరి మన్ననలు పొందడంపై అభినందించారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి, తిరుపతి జిల్లా స్పెషల్ బ్రాంచి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, నాయుడుపేట, పెళ్లకూరు ఎస్ఐలు గోపి, శ్రీకాంత్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరు రామకృష్ణం రాజు, రామరాజు కుటుంబ సభ్యులు, నెల్లూరు, తిరుపతి జిల్లా పరిధిలోని పలు పోలీసు స్టేషన్ల ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి కిలివేటి పరామర్శ



**మోహన్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కిలివేటి సంజీవయ్య**

**నాయుడుపేట టౌన్ :** సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం నాయుడుపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు కదూరు సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుధాకర్ సోదరుడు కదూరు మోహన్(42) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కిలివేటి వారి ఇంటి వద్దకు చేరుకున్నారు. మోహన్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, పోలేరమ్మ ఆలయ మాజీ చైర్మన్ గంధవల్లి సిద్ధయ్య, వైఎస్సార్ సీపీ ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, నాయకులు ముత్యాలరెడ్డి, చిందేటి వెంకటేశ్వర్లు, ఆర్మాట్ శాంతకుమార్, గోపి ఆచారి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



**మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, నాయకులు**



# ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య



**నేను బడికి పోతా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు**

**చిల్లకూరు :** ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈవో -2 ఎండీ రవూఫ్ తెలిపారు. ఆయన సోమవారం చింతవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ కూడలి వద్ద మానవ హారం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అన్ని వసతులు కల్పించినట్టు తెలిపారు. పిల్లలకు పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు బ్యాగు, షూస్, సాక్స్‌లు అందజేస్తున్నట్టు వివరించారు. మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, ప్రతి విద్యార్థికీ బైజూస్ కంటెంట్‌తో డిజిటల్ బోధన అందిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రుల తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నూతన చట్టాలపై అవగాహన


**వాకాడు : మాట్లాడుతున్న సీఐ హరిక్రిష్ణ, కోట: చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, గూడూరు రూరల్ : మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి**

**కోట:** నూతన న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వాకాడు సీఐ హరిక్రిష్ణ సూచించారు. కోట గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సోమవారం పోలీసులు కొత్తగా వచ్చిన చట్టాల గురించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కలిగించారు. సీఐ మాట్లాడుతూ నూతన చట్టాల ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించవచ్చన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు అమలవుతాయన్నారు. నేరం చేసిన వారు తప్పించుకునే అవకాశం ఉండదన్నారు. ఎస్ఐ నాగబాబు పాల్గొన్నారు.

**అమలులోకి నూతన చట్టాలు**


**గూడూరు రూరల్ :** మహిళల భద్రతకు సంబంధించి నూతన చట్టాలను అమలు చేస్తున్నామని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ కూడలి ప్రాంతంలో సీఐలు, ఎస్ఐలతో కలిసి నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో నేటికీ బ్రిటీష్ కాలం నాటి చట్టాలే అమలులో ఉన్నాయని తెలిపారు. వాటి స్థానంలో కేంద్రం కొత్త చట్టాలను ప్రవేశ పెట్టిందన్నారు. నేటి నుంచి అవి అమలులోకి వచ్చాయన్నారు. ఈ చట్టాలతో బాధితులకు నిర్ణీత కాలంలోనే న్యాయం జరుగుతుందని, అదే విధంగా తప్పుడు కేసులు పెట్టే వారిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజలు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

**వాకాడులో..**

**వాకాడు :** నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ హరికృష్ణ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక అశోక్ స్తంభం కూడలిలో చట్టాలపై అవగాహన కల్పించారు. కేంద్రం మూడు నూతన చట్టాలను తీసుకువచ్చిందన్నారు. అందులో భాగంగానే ఇప్పుడున్న ఐపీఎస్, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానాల్లో భారతీయ న్యాయ సన్హిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సన్హిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ అదనియం(బీఎస్ఏ) చట్టాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**మహిళలకు ప్రత్యేక రక్షణ**

**వెంకటగిరి రూరల్ :** చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి సీఐ సంగమేశ్వర రావు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను అమలులోకి తీసుకువచ్చిందన్నారు. మహిళలు, పిల్లలకు రక్షణ కల్పిస్తూ చేసిన చట్టంలో 37 సెక్షన్లు ఉన్నాయని తెలిపారు. 18 ఏళ్ల లోపు బాలికలపై సామూహిక అత్యాచారం చేస్తే జీవిత ఖైదు, మరణ శిక్ష విధిస్తారని పేర్కొన్నారు. ఏఎస్ఐ బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



**నాయుడుపేట టౌన్ : చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ శ్రీనివాసరెడ్డి**

**నాయుడుపేటలో..**

**నాయుడుపేట టౌన్ :** దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట డీఎస్పీ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డితో కలిసి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజలకు భారతీయ, న్యాయ సంహిత, భారతీయ నాగరిక్, సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య, తదితర కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

**తడలో..**

**తడ:** దేశ వ్యాప్తంగా సోమవారం నుంచి అమలులోకి వచ్చిన నూతన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. సూళ్లూరుపేట సీఐ మధుబాబు, తడ ఎస్ఐ నరసింహారావు పాల్గొన్నారు.

# వైభవంగా వార్షికోత్సవం



**ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి, మహావిష్ణువు, అయ్యప్ప స్వామి**

**రాపూరు:** రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయాల తృతీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం 5 గంటలకు అభిషేకం, 6 గంటలకు పూలంగి సేవ, 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువుకు కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. అయ్యప్ప, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌లో కొలువుతీర్చి ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు తిలక్‌రెడ్డి, గోపీచంద్, డాక్టర్ చంద్రశేఖర్, మస్తాన్ బాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



**విశేషాలంకరణలో స్వామి అమ్మవార్లు**